జారిపోయాడు. గుర్రు పెట్టసాగాడు. వృద్ధురాలికి చాలా దుఃఖమూ ఎన్నో కన్నీళ్లూ వొచ్చాయి. కాని తన కళ్ళు తానే తుడుచుకుంటూ.."బిడ్డ తప్పేముందీ ? కలిలో ఆకలిలో కూడా.. తల్లి బిడ్డ ఆకలి మరవజాలదు కానీ బిడ్డకి తల్లి ఆలకి స్పురణ రాదు.

అది కలి మహాత్యమూ ఆకలి మహాత్యమూ అని కొడుకు మీద ఈగ వాలకుండా తనకి తానే సర్దిచెప్పుకుంది.

అందుకే కదా ఆమె అమ్మ ? అమ్మంటే స్త్రీ కదా ?

- సుూస్త్రం -

# జీవితం

మెట్లెక్కి నేను లోపలికి ప్రవేశిస్తూండగానే నన్ను చూసి కంపొడరు చిరునవ్వు నవ్వి చేతితో ఓ మూలగది- అదే డాక్టరు తాలూకు పర్సనల్ రూమ్‌వేపు చూపించాడు. ఔను. నేను అతనికి కూడా సుపరిచితుడినే. పేషెంటుని కాకపోయినా రెండు రోజులకో..మూడు రోజులకో ఒకసారి డాక్టర్ని చూడకుండా ఉండలేను. స్నేహం. ఎవరో 'ప్రేమకూడా వ్యాధే' అన్నట్లు గుర్తు. స్నేహం కూడ జబ్బేనా ? ఐతే ఏం ? తీయని వ్యాధి. డాక్టర్ని చూసి నాలుగైదురోజులు దాటిపోతూంది. వర్షమూ ముసురూ. రోడ్లన్నీ బురద బురద. మన యిళ్లలాగే రోడ్లుకూడా ఎండకేతప్ప వానకి పనికిరావు.

స్వింగ్‌డోర్స్ తెరవబోతూ ఒక్కసారి సందేహించాను. కన్సల్టింగ్ టైములో డాక్టర్ పర్సనల్ రూమ్‌లో ఎందుకున్నాడు.

అతనికీ నాకూ మధ్య అరమరికలులేవు. నాకు ప్రవేశంలేదనే స్థలమూ లేదక్కడ.

తలుపులు తోశాను. సిగరెట్ పొగ గుప్పుమంది. మబ్బుపట్టిన ఆకాశంలా ఉంది సిగరెట్ పొగ ఆవరించిన ఆ గది.

"శేఖరం !...చంద్రశేఖరం..'

రెండో పిలుపుకి కాని నా రాకను గమనించలేదతను. గమనించాక మాత్రం. ఉత్సాహంగా ఆహ్వానించాడా అంటే అదీలేదు !

ఏదోలోకం నుంచి మల్లె నీరసంగా, నిర్లిప్తంగా " రా కూర్చో " అన్నాడు.

అవమానం అనిపించలేదు కానీ నా మనసు బాధపడింది. క్షమించేశాను.

అతను ఆలోచనల లోకంనుంచి దిగిరాద ల్చుకోనట్లున్నాడు.

అతన్నంత వేదిస్తున్న సమస్యేమిటి ?

"చెప్పవయ్యా ఏం జరిగింది ? ఈ మౌనమూ, ఆలోచనలూ ఏమిటి? అడిగాను. చంద్రశేఖరం నావేపు ఒకసారి చూశాడు. అతని కళ్లు చూశాక నాకు భయం వేసింది.నిశ్చయంగా అతని కళ్ళలోని కాంతిక్షీణతకు కారణం సిగరెట్ పొగ ఎంతమాత్రమూ కాదు. కొమ్మలు ఎండిపోడానికి కారణం చెట్టు వేళ్ళలో ఉండేటట్లే, చంద్రశేఖరం కళ్ళల్లోని నిర్లిప్తతకూ, నిరుత్సాహానికీ హేతువు అతని మనసులో ఉండి ఉండాలి. అది ఏమిటి?

"ఏమీ లేదు.." విషయం మార్చడానికి ప్రయత్నించాడు. నవ్వాడు.

అతను ఏమీలేదనడం వల్ల నిశ్చయంగా ఏదో వుండి ఉంటుందనిపించింది నాకు.

అపనమ్మకం కూడా మనిషి నైజంలో ఉంటుందేమో !

"ఈ వయసులో ..మన స్నేహంలో దాచుకోవలిసిన రహస్యాలుంటాయనుకోలేదు." అస్త్రం ఉపయోగిస్తే తప్ప అతను లొంగలేదు.

✧ ✧ ✧

భోరున వర్షం కురుస్తూంది. కొన్ని గంట నుంచీ అదేపనిగా ఆకాశం కనిపించనంత దట్టంగా పడుతూంది వర్షం. రాత్రి తొమ్మిది దాటుతోంది. నిద్రపోదామా అనుకుంటున్నాడు. తలుపు తట్టిన శబ్దమూ డాక్టరు గారూ అన్న పిలుపూ. లేచాడు. ఐదారుమైళ్ళ దూరంలో ఉన్న పల్లెటూరులో ఓ పేషెంట్ అటా యిటా అన్నట్లు న్నాడట. అతనివాళ్లు వచ్చి రమ్మంటున్నారు. రెండోమాట అనకుండా బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళాక జ్ఞాపకం వచ్చింది, టార్చి తెచ్చుకోలేదని. ఫరవాలేదని సరిపెట్టుకున్నాడు.

కరెంటులేని పల్లెటూరేమో చీకటి ముద్దలా ఉంది అదంతా జట్కా ఆగింది. ఆ యింటి లోపల దీపాలు వెలుగుతున్నాయి. ఎవరో దారిచూపగా పేషెంటున్న గదిలోకి నడిచాడు. అక్కడ కాంతివంతంగా వెలుగుతూంది దీపం టేబుల్ లాంప్.

పేషెంట్‌ను పరీక్షించసాగాడు చంద్రశేఖరం. ఐదునిమిషాలలో అతను నిర్ధారించుకున్నాడు. కేసు మరీ సీరియస్ ఏమీకాదు. ప్రాణాపాయం లేదు. పేషెంట్ తెలివిగానే ఉన్నాడు. సిరంజ్‌లోకి మందు ఎక్కించాడు. పేషెంట్ చూస్తున్నాడు. కళ్ళల్లో భయంతో అవతల వర్షం కురుస్తూనే ఉంది. గాలిరేగుతూనే ఉంది. సరిగ్గా ప్రిక్ చేయబోతున్నంతలో...

పెనుగాలి.. దీపం ఆరిపోయింది.

గొల్లుమని ఏడ్పు. పేషెంట్ తల్లికాబోలు "మమ్మల్ని అన్యాయం చేసిపోయావా నాయనా .." అంటూ రాగానికి లంకించుకుంది.

దీపం తేడానికి ఎవరో వెళ్లారు. అవతల వర్షం. గదిలో దుఃఖం.

డాక్టరుకి కోపమే వచ్చింది. " ఫరవాలేదని చెప్పానుగా ఎందుకనవసరంగా ఏడుస్తారు? మీ రాగాలూ, శోకాలూ పూర్తిగా అనవసరం."

ఎవరో అన్నారు గుమ్మం దగ్గర్నుంచి "అన్ని దీపాలూ ఆరిపోయాయి."

ముసిలిగొంతుకలో శోకం పెరిగిపోయింది. "మీకు తెలీదు డాక్టరుబాబూ ! నా కొడుకు.. నా కళ్ళ వెలుగు.. మా యింటి దీపం ఆరిపోయింది."

అసంభవం- చీకట్లో నవ్వుకుంది. వైద్యశాస్త్రం. ఆ తల్లి అమాయకత్వానికి జాలిపడింది. దీపం వెలిగించి తెచ్చారు. ఒకటి ..రెండు..మూడు.. ఒకదానివెంట ఒకటిగా ఆ గదిలోకి దీపాలు కాంతిని పెంచుతున్నాయి.

ఇప్పుడాగది సత్యంలా అతి ప్రకాశవంతంగా ఉంది. సిరంజ్ తీసుకొని నరం కోసం పేషెంట్ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అంతే.

✧ ✧ ✧

"ఇన్నాళ్లూ తెలుసుకున్న శాస్త్రం అలా అయింది. ఆ ముసిలమ్మకు తన కొడుకు పోయాడని ఎలా తెలిసింది.? అసలు ఆ కొడుకు ఎందుకు చనిపోయాడు? అతను చనిపోవడానికి శాస్త్రరీత్యా ఏ కారణమూ కనిపించదు. పొరపాటు ఎక్కడ జరిగింది? నాలోనా, నా శాస్త్రంలోనా ?"

అర్థమయింది - అతని ఆవేదన.

ఔను. యాభైయేళ్ళ వయసులో అతనికీ బాధ సహజమే. ఇన్నాళ్లూ తానెంతో నమ్మిన విద్య ఒక్కసారి ఓడిపోతే.. బాధగానే ఉంటుంది.

మెల్లగా అన్నాను - "పొరపాటు నీదీకాదు. నీ వైద్యశాస్త్రానిదీ కాదు ఆ చీకటిది ". ఖచ్చితంగా అన్నాను.

ప్రశ్నార్థకంగా చూశాడు చంద్రశేఖరం నావేపు. " ఆగాలిది..సుడిగాలిది.. ఆ దీపానిది.. " ఖచ్చితంగా అన్నాను.

అతను నన్ను వెర్రివాడిని మల్లే చూశాడు. నేను చెప్పసాగాను నా ధోరణిలో. "పేషెంట్ చావ సిద్ధంగా లేకపోయినా కొంత బలహీనంగా ఉండి ఉంటాడు."

"ఔను"

" కాంతి..వెలుగు..ధైర్యాన్నిస్తుంది. ఆ వెలుగులో తన వారినీ, డాక్టరునీ చూస్తూ అతను ధైర్యంగానూ, ఆశగానూ ఉండగలిగాడు. కాని ఒక్కసారి చీకటి ఆవరించేసరికి షాక్ తగిలినట్లయి ఆ బలహీనుడు కళ్లు తేలవేశాడు."

"బాగానే ఉంది.మరి యిలా జరుగుతుందని జరిగిందని ఆ ముసిలమ్మకెలా తెలిసింది.?"

ఈ డాక్టర్లతో వచ్చిన చిక్కిదే. అన్నిటికీ శాస్త్రీయమయిన ఆధారాలు వెతుకుతారు. శాస్త్రానికి అతీతంగా కూడా కొంత జీవితం ఉంటుందంటే అంగీకరించరు.

డాక్టరు చంద్రశేఖరం బాధ నాకు పూర్తిగా అర్థమయింది. ఓ చదువురాని ముసలిదాని ముందు తన వైద్యశాస్త్రము ముసిలిదాని ముందు తోకముడి చేసిందే అతని చిన్నతనం. ఇప్పుడు నేను దానికే మాటలమందు వేయాలి. అతని మానసిక రుగ్మత నివారించాలి.

"చదువు వేరు, జ్ఞానం వేరు. అక్షరాలకంటే అనుభవం ఎక్కువ శక్తికలది. ఆపైన సిక్స్‌సెన్స్. ఇవన్నీ వదిలేసినా.. గుడ్డి గుర్రపు తాపు ఉండనే ఉందిగా ? వైద్యశాస్త్రం గురించి తెలీని,నమ్మకం చాలని ఆ ముసిలమ్మ అంతరాంతరాలలో కొడుకు చనిపోతాడేమో అనే భయపడుతోంది. దీపాలు ఆరిపోయి చీకటి ఉరికేసరికి ఆమెకు షాక్ తగిలి ..దుఃఖానికి చిల్లుపడి శోకంలా వాలికింది. మిడతంబొట్లు శకునంలా ఆమెనోట నిజం పలికింది.

తన శాస్త్రం ఓడిపోలేదని వినేసరికి, డాక్టరు ముఖం వికసించింది. ఈ చిత్రమయిన పరిస్థితిలో ఆ ముసిలమ్మ గెలిచిందే తప్ప డాక్టరు ఓడిపోలేదు ! ఔను మాటలు మసిపూయకుండా నే మారేడుకాయలు చేయగలవు.

కాని నా నమ్మకమూ అనుభవమూ ఏమిటంటే జ్ఞానం ఎంత వికసించినా యింతో అంతో అజ్ఞానం మిగిలేవుంటుంది. కాంతితోపాటు క్రీనీడలూ మిగిలి ఉంటాయి. సత్యంతోపాటు అసత్యమూ ఉంటుంది.

ఈ స్తంభాలాటలో వెదుకులాడుకోడమే కాదూ జీవితం ? అందుకేకాదూ మానవ జీవితంలో యింత ఆకర్షణా, యింతా వైవిధ్యమూ ? ఎన్ని కళ్లతో చూస్తే ఎన్ని మెదళ్ళలో ఆలోచిస్తే జీవితం అందుతుంది ?

- సమాప్తం -